సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 5 । జూన్ । 2025



ముంచుకొస్తున్న ముప్పు..
పలు కారణాలతో ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నందున సహజ సంపదను కాపాడాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. 12లో



ఉద్యోగాల గని.. సింగరేణి
సింగరేణిలో ప్రస్తుతం 19 ఓపెన్‌కాస్ట్‌లు, 23 భూగర్భ గనుల్లో అన్ని విభాగాల వారు కలిపి 74,400 మంది పనిచేస్తున్నారు. 12లో

గరిష్టం / కనిష్టం
38° / 26°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మలేరియా కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

భద్రాచలంటౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయడంతో పాటు మందులు అందించాలని సిబ్బందికి సూచించారు. మలేరియా నివారణలో భాగంగా ఐఆర్‌ఎస్ పిచికారీకి అవసరమైన ఏసీఎంలను జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలకు అందజేశామని చెప్పారు. అనంతరం సిబ్బందికి మలేరియా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు తప్పనిసరి

కొత్తగూడెంఅర్బన్ : గర్భిణుల వివరాలు ముందస్తుగా నమోదు చేయాలని, సకాలంలో ప్రసవాలు చేసేలా చూడాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్.లక్ష్మి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల గర్భిణులను అంచనా వేసిన డెలివరీ తేదీల కంటే ముందుగానే అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని అన్నారు. అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరగాలని, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో వైద్యులు మధువరణ్, తేజశ్రీ, పుల్లారెడ్డి, భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

పాల్వంచరూరల్ : వానాకాలంలో పశువులు, గొర్రెలు, మేకలకు సంక్రమించే వ్యాధుల నివారణకు గత నెల 27 నుంచి ఈనెల 26 వరకు టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2.30 లక్షల ఆవులు, గేదెలకు గొంతువాపు, జబ్బవాపు, ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు, 1.41 లక్షల గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింగరేణిలో 39 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న 39 మంది అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఒక ఏజీఎం, ఏడుగురు డీజీఎంలు, 12 మంది డిప్యూటీ పీఎంలు, 17 మంది సీనియర్ పీఓలు, ఇద్దరు సంక్షేమాధికారులు ఉన్నారు.

ముందస్తు వరద హెచ్చరిక

పాల్వంచరూరల్: వర్షాలు కురుస్తున్నందున కిన్నెరసాని ప్రాజెక్టు ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగితే గేట్లను ఇప్పటి నుంచి వర్షకాలం పూర్తయ్యే నవంబర్ వరకు ఎప్పుడైనా ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని కిన్నెరసాని ప్రాజెక్టు సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతిని బట్టి గేట్లు ఎప్పుడైనా ఎత్తే అవకాశం ఉంటుందని, వీలైనంత వరకు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎత్తి వాగులోకి వరద నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు.

నేతల్లో నైరాశ్యం



పంచాయతీ, పరిషత్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సత్తా చాటాలని హస్తం పార్టీ హైకమాండ్ దిశా నిర్దేశం చేసింది. అందుకు తగ్గట్టే పార్టీలో పై స్థాయి నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. కానీ క్షేత్రస్థాయి నాయకత్వంలో మాత్రం అంతగా జోష్ కనిపించడం లేదని ఆ పార్టీ వారే చెబుతున్నారు.
– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పని చేస్తున్నా పదవులు దక్కడం లేదని అసంతృప్తి

- నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యంపై ఆందోళన
- కష్టపడినా గుర్తింపు లేదంటున్న కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నేతలు
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా పలువురు..

అసంతృప్తిలో నేతలు

సంప్రదాయ కాంగ్రెస్ వాదులు, తెలంగాణ వచ్చిన తర్వాత పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న నేతల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ ఉధృతిని, అప్పటి ప్రభుత్వ ఒత్తిడులు, బెదిరింపులు, ప్రలోభాలను తట్టుకుని పార్టీ కోసం పని చేసిన తమకు ప్రస్తుతం తగిన గుర్తింపు దక్కడం లేదనే భావన వారిలో నెలకొంది. ఇప్పటికే కొందరు పార్టీ కార్యక్రమాల్లో అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తుంటే, మరికొందరు వ్యక్తిగత పనులకే ఎక్కువ సమయం కేటాయిస్తూ పార్టీ వ్యవహారాలపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది.

బీఆర్‌ఎస్ హవాను తట్టుకుని..

తెలంగాణ వచ్చిన తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా బీఆర్‌ఎస్ హవా కనిపిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటింది. దీంతో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు భద్రాద్రి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకర్గాల నుంచి అనేక మంది ఆశావహులు ముందుకొచ్చారు. పార్టీ టికెట్ దక్కించుకోవడం కోసం ఎన్నికలకు రెండు, మూడేళ్ల ముందు నుంచే నియోజకర్గ స్థాయిలో శ్రమించారు. కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు పోట్ల నాగేశ్వరరావు, నాగ సీతారాములు వంటి వారు ఆసక్తి చూపించగా పినపాక నుంచి బట్టా విజయ్‌గాంధీ, చందా సంతోష్, పోలెబోయిన శ్రీవాణి, అశ్వారావుపేట నుంచి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి టికెట్ ఆశించారు. ఇక రాష్ట్రంలోనే అత్యధిక మంది అభ్యర్థులు ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ కోసం పోటీ పడ్డారు. ఇందులో చివరి నిమిషం వరకు శంకర్‌నాయక్, డాక్టర్ రవి, చీమల వెంకటేశ్వర్లు తదితర నేతలు టికెట్ రేసులో మిగిలారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో గ్రామ, మండల స్థాయిల్లో తమకంటూ అనుచరగణం ఏర్పాటు చేసుకుని పని చేశారు.

'నామినేటెడ్' భర్తీ ఎప్పుడో ?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన పాదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి దక్కింది. ఇక ఆ తర్వాత నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెద్దగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయలేదు. దీంతో పార్టీ కోసం చెమటోడ్చిన తమను ఇంకెప్పుడు గుర్తిస్తారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. 18 నెలలుగా ఎలాంటి పదవులు దక్కలేదని, తమను నమ్ముకున్న వారికి కనీస స్థాయిలో సాయం చేసే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కింది స్థాయి కేడర్‌లో ఉత్సాహం నింపేలా, గతంలో టికెట్లు దక్కని నేతల రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నారు. మరికొందరు మాత్రం పార్టీ కోసం ఓపికగా పని చేసుకుంటూ వెళితే సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందనే నమ్మకంతో ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల నుంచి..

ఎన్నికల సమీకరణలు, వ్యూహాల్లో భాగంగా కొత్తగూడెం టికెట్ సీపీఐకి కేటాయించగా, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడిచిన పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణకు అవకాశం దక్కింది. భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు టికెట్ ఇచ్చారు. అయితే కొత్తగూడెంలో మిత్రపక్షమైన సీపీఐ, మరో మూడు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. భద్రాచలంలో పొదెం వీరయ్య ఓడిపోయారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమ శ్రమకు తగిన గుర్తింపు ఉంటుందని టికెట్ దక్కని ఆ పార్టీ నేతలు ఆశించారు.



ఆయిల్‌పామ్‌తో అదనపు ఆదాయం



ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగవుతున్న వేరుశనగ

- అంతర పంటల సాగుకు అనేక అవకాశాలు
- కుటీర పరిశ్రమలు సైతం ఏర్పాటు చేసుకోవచ్చు
- నాలుగేళ్లలోనే తీరనున్న పెట్టుబడి ఖర్చులు



తోటలో పెంచుతున్న నాటు కోళ్లు

అశ్వారావుపేటరూరల్: దీర్ఘకాలిక పంటగా పేరున్న ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగు, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో అదనపు ఆదాయానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో కొంతకాలంగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 75, 049 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉండగా అందులో 63 వేల ఎకరాల్లో అంతర పంటలు సాగు చేస్తుండడం విశేషం.

సాగునీరు, శ్రమ ఆదా..

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగుతో అధిక ఆదాయం వస్తుంది. ఎకరం తోటలో 59 పామాయిల్ మొక్కలు నాటితే వాటి మధ్య ఖాళీ ప్రదేశం ఎక్కువగా ఉంటుంది. ఆ స్థలంలో తొలి నాలుగేళ్ల పాటు మొక్కజొన్న, వేరుశనగ, పుచ్చ, బొబ్బర్లు, పత్తి, అరటితో పాటు బీర, దోస, చిక్కుడు, సొరకాయ, బెండ వంటి కూరగాయలు, బంతి, చామంతి వంటి పూలసాగు కూడా చేస్తూ ఆదాయం గడించవచ్చు. దీంతో ఎరువుల ఖర్చు కలిసొస్తుంది. డ్రిప్ ద్వారా ఏక కాలంలో ఆయిల్‌పామ్, అంతర పంటలకు సాగునీరు అందించడం ద్వారా నీరు, శ్రమ కూడా తగ్గుతాయి. ఐదేళ్లకు పామాయిల్ మొక్కలు పెరిగాక కూడా అంతర పంటలుగా కోకో, వక్క, జాజికాయ పంటలు సాగు చేయొచ్చు. పెట్టుబడి ఖర్చులన్నీ మొదటి నాలుగేళ్లలోనే వెనక్కు వచ్చే అవకాశం ఉంటుంది.

కుటీర పరిశ్రమలకూ చాన్స్..

ఆయిల్‌పామ్ గెలల దిగుబడి వచ్చిన తర్వాత కూడా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో ప్రధానంగా నాటు కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, తేనెటీగల పెంపకం, ఫారం కోళ్ల షెడ్లు, వర్మి కంపోస్టు తయారీ యూనిట్ల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం గడించే అవకాశం ఉంటుంది.

అంతర పంటలు సాగు చేయండి



ఆయిల్‌పామ్ తోటల్లో తొలి నాలుగేళ్లు, ఆ తర్వాత ఐదేళ్ల తర్వాత కూడా అంతర పంటలు సాగు చేయొచ్చు. ఆయా ప్రాంతాల్లో పండే ఏ రకం పంటలైనా వేసుకోవచ్చు. ఈ అదనపు ఆదాయంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంది. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అనేక రాయితీలు, సబ్సిడీలు ఇస్తున్నందున అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.
– జంగా కిషోర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

కలెక్టర్ జితేష్ వి పాటిల్



రెవెన్యూ సదస్సులో దరఖాస్తు పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెంఅర్బన్ : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, సమస్యలు ఉన్నవారు సదస్సుల్లో దరఖాస్తు అందజేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలకలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ రికార్డుల్లో పేర్ల తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. వాటి పరిశీలనకు భూ భారతి చట్ట ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతారని, నిర్దేశిత గడువు లోగా సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. ఆర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు తదితరులు పాల్గొన్నారు.

జయరాజు స్ఫూర్తి ఆదర్శం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయరాజు అందించిన స్ఫూర్తి ముందు తరాలకు ఆదర్శమని కలెక్టర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జయరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రకృతి పరిరక్షణకు జయరాజుతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమ సభ్యులు రాజేంద్రప్రసాద్, సుగుణారావు, నాగ సీతారాములు, వెంకటముత్యం, సురేష్, వరలక్ష్మి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ..

కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోనికి రానీయొద్దని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్‌లు ఎండీ.ముజాహిద్, రంగాప్రసాద్, ఆయా పార్టీల నాయకులు నోముల రమేష్, లక్ష్మణ్ అగర్వాల్, రాంబాబు తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

మహిళలకు ఐటీడీఏ పీఓ సూచన



మిల్లెట్ బిస్కెట్ల తయారీని పరిశీలిస్తున్న రాహుల్

భద్రాచలం : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏలోని పీఈటీసీ కాంప్లెక్స్‌లో గల భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ న్యూట్రీ బిస్కెట్ కేంద్రాన్ని, వైటీసీలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిస్కెట్లు నాణ్యతతో తయారు చేసి ప్రజలకు అందించాలని సూచించారు. కుట్టు మిషన్ శిక్షణ ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని, మరికొందరికి సైతం కుట్టు శిక్షణ అందించాలని అన్నారు. బ్లౌజ్, స్కర్ట్ ,యూనిఫామ్, పంజాబీ డ్రెస్, షర్ట్, నిక్కర్, ఫ్రాక్ చుడీదార్ వంటివి కుట్టడంలో పరిణతి చెందితే రాబోయే రోజుల్లో ఎంబ్రాయిడరీ శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు జారీ చేసి, బ్యాంకు ద్వారా ముద్ర రుణాల కింద కుట్టు మిషన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత గిరిజన యువతకు శిక్షణ అందిస్తున్న హాస్టళ్లు, గదులను పరిశీలించారు. యువత వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. అనంతరం పీఎంఆర్‌సీ భవనంలో రెండో విడత ఉద్దీపకం బుక్‌లెట్స్ డాటా వివరాలను డీడీ మణెమ్మను అడిగి తెలుసుకొన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మిస్తున్న షటిల్ కోర్టు, ఇండోర్ క్రీడా స్థలం పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏసీఎంఓ రమేష్, జేడీఎం హరికృష్ణ, క్రీడల అధికారి గోపాల్‌రావు, ఎంఎస్‌ఎంఈ యూనిట్ మహిళలు లలిత, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తున్నాం



వేలిముద్ర మిషన్‌ను పరిశీలిస్తున్న రుక్మిణీ దేవి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు మూడు నెలల సన్నబియ్యాన్ని ముందుగానే పంపిణీ చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుక్మిణీ దేవి తెలిపారు. జిల్లాలోని పలు రేషన్ దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్డుదారులకు అవసరమైన 17,287 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు దఫాల వారీగా తరలిస్తున్నామని చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకు బియ్యం పంపిణీ ఉంటుందని, డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. జిల్లాలోని 443 రేషన్ షాపుల్లో ఇప్పటివరకు 32,488 మంది కార్డుదారులు బియ్యం తీసుకున్నారని వివరించారు.

విభజన అశాస్త్రీయం

- పాత వార్డులనే కలిపి చూపించారు..
- క్షేత్రస్థాయి సందర్శన లేకుండానే జాబితాలు..
- అధికారుల పర్యవేక్షణ లోపం.. బిల్ కలెక్టర్ల ఇష్టారాజ్యం



అశ్వారావుపేట మున్సిపల్ కార్యాలయం

అశ్వారావుపేట : 'తాళి కట్టించా.. తన్నుకు చావండి..' అన్న చందంగా మారింది అశ్వారావుపేట మున్సిపాలిటీలో వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ. మున్సిపాలిటీలో వార్డులు, డివిజన్‌ల ఏర్పాటు/పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనికి ముందే సిద్ధం కావాల్సిన మున్సిపల్ సిబ్బంది.. ఆదాయ మార్గాలైన ఎల్‌ఆర్‌ఎస్, గృహ నిర్మాణ అనుమతుల వంటి ఆర్థిక లావాదేవీల్లో నిమగ్నమై వార్డుల విభజనను భ్రష్టు పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి.

అంతా గందరగోళం..

అశ్వారావుపేట మున్సిపాలిటీని 22 డివిజన్లుగా విభజించారు. ఇందులో అశ్వారావుపేట మేజర్ పంచాయతీలోని పాత 16 వార్డులను ప్రస్తుతం 1 నుంచి 8 వార్డులకు కేటాయించారు. 9, 10 వార్డుల్లో పేరాయిగూడెం పంచాయతీలోని ఏఎస్‌ఆర్ కాలనీ, బీసీ కాలనీ, మోడల్ కాలనీ, ఫైర్ కాలనీలు ఉన్నాయి. ఆ తర్వాత జాతీయ రహదారికి ఉత్తరం వైపున ఉన్న అశ్వారావుపేట సరిహద్దు బండి పుల్లారావు రోడ్డు నుంచి లక్కీ అపార్ట్‌మెంట్ వరకు 11వ వార్డు, అక్కడ కట్ చేస్తే.. వ్యవసాయ క్షేత్రాల ఆవల ఉన్న మారుతీనగర్, గుర్రాల చెరువు ప్రాంతాన్ని 12వ వార్డులో, దొంతికుంట చెరువుకు ఆనుకుని ఉన్న భవనాలు, భద్రాచలం రోడ్‌కు పడమర భాగాన్ని 13వ వార్డులో, సంతమార్కెట్ నుంచి తూర్పు బజార్ వరకు 14 వార్డుగా, వెలమబజార్ నుంచి భూపతి మాస్టార్ ఇంటి మీదుగా పాలడుగుల రంగమణి ఇంటి వరకు 15వ వార్డు, రామాలయం బజార్, మున్సిపాలిటీ వెనుక భాగం, జవహర్ కాన్వెంట్ నుంచి చెక్‌పోస్టు వరకు 16వ వార్డు, మళ్లీ కట్ చేస్తే పూర్వ పేరాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ, బీసీ కాలనీలలో కొంత భాగం 17వ వార్డు, ఆ తర్వాత పేరాయిగూడెం, నెహ్రూనగర్, ఫైర్ కాలనీల్లో కొంత భాగాన్ని 18వ వార్డు, ఆ తర్వాత జాతీయ రహదారి దాటి షిరిడీ సాయి నగర్‌ను 19 వవార్డు, బస్టాండ్‌కు తూర్పు భాగపు ప్రాంతాన్ని 20వ వార్డు, ఇందిరాకాలనీ, బీఎస్‌ఆర్ నగర్‌లో కొంత భాగం 21వ వార్డు, తిరిగి ఫైర్ కాలనీ, మోడల్ కాలనీల్లో కొంత భాగంతో 22వ వార్డుగా విభజించారు.

మొక్కుబడిగా ప్రక్రియ..

నిబంధనల ప్రకారం వార్డులు ఒకదానికొకటి పక్కపక్కనే ఉండాలి. పూర్వ జనగణన ఆధారంగా వార్డులను విభజించి సరిహద్దులు గుర్తించాలి. జాబితాలపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని మ్యాప్ రూపొందించాలి. కానీ పేరాయిగూడెం పంచాయతీలోని అన్ని ఆవాసాలను విభజించి రెండు, మూడు వార్డుల్లో పొందు పరిచారు. పాత ఓటరు జాబితా, వార్డుల జాబితాలను కాపీ, పేస్ట్ చేసినట్లుగా ఉంది తప్పితే మున్సిపల్ సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదని పలువురు అంటున్నారు. మొక్కుబడి విభజనతో ఎన్నికల్లో పోటీ చేసే వారితో పాటు, సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి డీలిమిటేషన్‌లో అనుభవం ఉన్న అధికారులతో వార్డుల విభజన చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

'గూడెం'లోనూ అదే తీరు..

- డివిజన్ల ముసాదాయి డ్రాఫ్ట్ విడుదల
- 11 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అసంతృప్తిలో మాజీలు, ప్రజాప్రతినిధులు



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల విభజన ముసాయిదా విడుదలైంది. అయితే ఏర్పాటు ప్రక్రియ అందరికీ ఆమోదయోగ్యంగా లేదనే వాదనలు వెల్లువెత్తున్నాయి. డివిజన్ల విభజన కాదు.. పాత వార్డుల్లో కమ్యూనిటీల విభజన చేసినట్టు ఉందని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం గతంలో ఎన్నికైన వార్డు ప్రస్తుతం వారి డివిజన్‌లో కలిసిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఓటర్లయితే తాము ఏ డివిజన్‌లోనికి వెళ్లాం, అది ఏ ఏరియా అని తెలియక గందరగోళంలో ఉన్నారు. కార్పొరేషన్ కార్యాలయ నోటీసు బోర్డులో ఏర్పాటు చేసిన ముసాయిదా డ్రాఫ్ట్‌ను చెక్ చేసుకుంటున్నారు. అయితే డివిజన్ల విభజనపై అసంతృప్తిగా ఉన్నవారు అభ్యంతరాలను ఈ నెల 11 వరకు ఇవ్వొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

పాల్వంచ నుంచి మొదలు..

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం 60 డివిజన్లుగా విభజించారు. కొత్తగూడెం 29 డివిజన్లు, పాల్వంచ 27, సుజాతనగర్ 4 డివిజన్లుగా ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో మొత్తం 1,34,011 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కొత్తగూడెం పరిధిలో 63,750 మంది, పాల్వంచకు సంబంధించి 61,240, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలో 9,021 మంది ఉన్నారు. 1 నుంచి 27వ డివిజన్ వరకు పాల్వంచ ఉండగా, 28 నుంచి 38 వరకు కొత్తగూడెం, మళ్లీ 39 నుంచి 42వ డివిజన్ వరకు సుజాతనగర్ మండలంలోని నిమ్మలగూడెం నుంచి నర్సింహాసాగర్ వరకు, ఆ తర్వాత 43 నుంచి 60వ డివిజన్ వరకు కొత్తగూడెం బాబుక్యాంపు నుంచి కూలీలైన్ వరకు ఏర్పాటు చేశారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 11 వరకు సమర్పించాలని అధికారులు కోరారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించడం బాధ్యత



నిమ్మరసం అందజేస్తున్న వనమా వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులకు మెరుగైన వైద్యం అందించటం సింగరేణి బాధ్యతని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేపట్టారు. దీనికి సంఘీభావం తెలిపిన అనంతరం సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పా) కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు యాజమాన్యం చెప్పడం వాస్తవ దూరమని, కార్పొరేట్ వైద్యం పేరుతో రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ కార్మికులకు సరైన వైద్యం అందడం లేదని ఆరోపించారు. కాగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కూడా దీక్షకు మద్దతు పలికారు. మిరియాల రాజిరెడ్డి, కాపు కృష్ణ, సీతాలక్ష్మి, వీరభద్రయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయం బోర్డు మార్పు



కొత్త బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

పాల్వంచ: ద్వితీయ శ్రేణి పాల్వంచ మున్సిపాలిటీ కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలిసి డివిజన్ కేంద్రంగా ఏర్పడింది. ఈ క్రమంలో మున్సిపాలిటీ కార్యాలయం బోర్డు కాస్తా కొత్తగూడెం కార్పొరేషన్ బోర్డుగా బుధవారం మార్చారు. ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో డివిజన్‌ల ఏర్పాటు శరవేగంగా జరుగుతుండగా కార్యాలయ బోర్డు సైతం కార్పొరేషన్ బోర్డుగా ఏర్పాటు కావడం గమనార్హం.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో సత్తా



అథ్లెట్లతో డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-10, 12 అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న డి.లోహిత, సీహెచ్.లాస్య అండర్-10 విభాగంలో, అండర్-12 బాలికల విభాగంలో ఎం.భవిత, బి.రుత్విక, బాలుర అండర్-12లో డి.ఉపేక్షిత్ ఈ.వరుణ్ బహుమతులు సాధించారు. క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ బుధవారం అభినందించారు.

ముంచుకొస్తున్న ముప్పు..

- నానాటికీ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- వివిధ కారణాలతో తరుగుతున్న అడవులు
- వాతావరణ సమతుల్యతకు మరింత విఘాతం
- పర్యావరణ పరిరక్షణే మార్గమంటున్న నిపుణులు

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



జిల్లాలోని అటవీ ప్రాంతం

చుంచుపల్లి: మానవ మనుగడలో పర్యావరణం కీలకపాత్ర పోషిస్తుంది. అయితే కొన్నేళ్లుగా మానవ తప్పిదాలు, ఇతర కారణాలతో ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. విలువైన సహజ సంపదను కాపాడుకునే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేస్తేనే భావితరాలు సాఫీగా సాగుతాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. విచక్షణా రహితంగా చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల నుంచి వచ్చే విష వాయువులు, వ్యర్థాలతో భూతాపం పెరగడం, భూ, వాయు, జల కాలుష్యాలు పెరుగుతుండడం వంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించాలంటే ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఇందుకోసం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తారు.

అడవుల తగ్గుదలతో ఆందోళన

అడవుల అభివృద్ధితోనే పర్యావరణ సమతుల్యతను కాపాడటం అనేది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. పలు రకాలైన జంతు, వృక్ష జాతులకు ఆశ్రయం కల్పించి జీవవైవిధ్యాన్ని సంరక్షించేందుకు తోడ్పడతాయి. అడవులు భూసారాన్ని కాపాడమే కాకుండా నేల క్షీణతను నిరోధిస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవ మనుగడకు అడవులే ఆధారం. 2021 నుంచి 2023 వరకు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గటం ఒకింత ఆందోళన కలిగించే అంశం. ఉమ్మడి జిల్లాలో మూడేళ్ల వ్యవధిలో 121.21 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గినట్లు ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్–2023ను గతేడాది డిసెంబర్‌లో వెల్లడించింది. 2021–23 మధ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 95.55 చ.కి.మీ. ఖమ్మం జిల్లాలో 25.76 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గిందని నివేదికలో పేర్కొంది. 2021 కాలంలో 2,957.21 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2023 చివరి నాటికి 2,861.66 చ.కి.మీ.కి తగ్గినట్లు తెలిపింది. ఇక ఖమ్మం జిల్లాలో 2021 కాలంలో 633.23 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉండగా, 2023 ముగిసే నాటికి 607.47 చ.కి.మీ.గా నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్ (–115.50) తర్వాత భద్రాద్రి జిల్లా (–95.55) రెండో స్థానంలో నిలవగా, ఖమ్మం మూడో స్థానంలో ఉందని వివరించింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు.. తదితర ఎనిమిది అటవీ డివిజన్లలో ఒక్క కిన్నెరసాని వైల్డ్‌లైఫ్‌లో తప్ప మిగతా వాటిలో అటవీ విస్తీర్ణం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అక్రమణలు, అగ్ని ప్రమాదా అందుకు కారణమని, అగ్ని ప్రమాదాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటిస్థానంలో ఉన్నట్లు తేలింది.

ఉమ్మడి జిల్లాలో అటవీ విస్తీర్ణం (చ.కి.మీ.ల్లో)

	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
అటవీ డివిజన్లు	06	02
దట్టమైన అడవులు	637.34	42.68
మధ్యస్థాయి అడవులు	1,502.70	261.44
ఓపెన్ అడవులు	721.60	303.30

విస్మరిస్తే తీరని నష్టం



రోజురోజుకూ వాతావరణంలో మార్పుల కారణంగా మానవ మనుగడ భవిష్యత్‌లో కష్టతరం కానుంది. అటు రుతువుల్లో వస్తున్న మార్పులతో రైతులకు సైతం నష్టం వాటిల్లుతోంది. ఇక వేసవి సీజన్‌లో భూగర్భజలాలు అమాంతం పడిపోతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరమని గుర్తించాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే తలెత్తే పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–బి.రవీందర్, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పర్యావరణానికి చాలా ప్రమాదం పొంచి ఉందనేది ఇప్పటికే తెలుస్తోంది. అటవీశాఖ అన్ని చోట్ల మొక్కలు నాటే ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది. ఏటా వనమహోత్సవం పేరుతో లక్షలాది మొక్కలను నాటి సంరక్షిస్తోంది. అటు స్వచ్ఛంద సంస్థలు తమవంతు ముందుకు వచ్చి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి. యువతీ, యువకులు ఒక మొక్కను పెంచే బాధ్యత తీసుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

–కిష్టాగౌడ్, డీఎఫ్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

కార్పొరేషన్ భూముల ఆక్రమణకు యత్నం

- వెదురు చెట్లను నరుకుతున్న గిరిజనులు
- అడ్డుకున్న అధికారులు.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం



ప్లాంటేషన్‌లో చెట్లు నరుకుతున్న గిరిజనులు



గిరిజనులను అడ్డుకుంటున్న ఎఫ్‌డీసీ రేంజర్ చంద్రకళ, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఫారెస్టు అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ)కు చెందిన భూముల్లో ఉన్న వెదురు చెట్లను కొందరు గిరిజనులు నరుకుతుండగా బుధవారం వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు అడ్డుకోగా, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన గిరిజనులకు సర్వే నంబర్లు 30, 36, 39లో 573 ఎకరాలకు సంబంధించి 150 మందికి హక్కు పత్రాలు, పాత పట్టాలు ఉన్నాయి. కాగా, 30 ఏళ్ల కిందట తమ పెద్దలను ఆ నాటి అధికారులు మోసం చేసి అన్యాయంగా తమ భూముల్లో ఎఫ్‌డీసీ, అటవీశాఖ ఆధ్వర్యంలో వెదురు, టేకు ప్లాంటేషన్లు వేసినట్లు గిరిజనులు కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగు రోజుల కిందటి నుంచి గ్రామస్తులంతా కలిసి వెదురు, ఇతర చెట్లను నరివేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎఫ్‌డీసీ డీఎం రమేశ్, డీఆర్‌ఓ రవికుమార్, ఎఫ్ఆర్ఓ చంద్రకళ, ఫారెస్టు రేంజర్ మురళి, సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి వెళ్లి గిరిజనులను అడ్డుకున్నారు. దీంతో గిరిజనులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే స్థానిక సీఐ పింగళి నాగరాజురెడ్డి, ఎస్ఐ యయాతి రాజు, ట్రైనీ ఎస్ఐ అఖిలతోపాటు సిబ్బంది వెళ్లి ఇరువర్గాలను శాంతింపజేశారు. దీంతో గిరిజనులు తమ వద్ద ఉన్న ఆధారాలతోపాటు, 2011లో ఖమ్మం జిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్ తమకు ఈ భూములను అప్పగించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశించిన వివరాలను సీఐకి చూపించారు. కాగా, ఆ నాటి నుంచి అధికారులు సర్వేల పేర్లతో తమను మోసం చేయడంతోపాటు, పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. ఇరువర్గాలు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, అప్పటిదాకా చెట్లను ధ్వంసం చేయవద్దని సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కాగా, వెదురు చెట్లను నరికిన నలుగురు గిరిజనులపై ఎఫ్‌డీసీ డీఆర్‌ఓ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వెంగళరాయసాగర్ అలుగుకు మోక్షం

- రూ.33.55 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జారె



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం శివారులో ఉన్న వెంగళరాయసాగర్ అలుగు నిర్మాణానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. అలుగు పునఃనిర్మాణానికి ప్రభుత్వం రూ.33.55 కోట్లు మంజూరు చేసింది. సుమారు ఐదేళ్ల కిందట అలుగుకు పెద్ద ఎత్తున గండి పడింది. ఏడు గ్రామాల రైతులకు సంబంధించి 2,200 ఎకరాల ఆయకట్టు ఈ ప్రాజెక్ట్ కింద ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అలుగు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చానని, రెండు నెలలల్లో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తాను స్వయంగా కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు నిధులు కేటాయించారన్నారు. అశ్వారావుపేటలోని పెద్దవాగు, ములకలపల్లి మండలంలోని మూకమామిడి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేశ్‌కుమార్, డీఈ కృష్ణశంకర్, ఏఈ నర్సింహారావు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, పీఆర్ డీఈ సైదురెడ్డి, నాయకులు భోజ్యానాయక్, నల్ల మోతు రమణ, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు, ఫజల్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 32 మందికి జరిమానా

కొత్తగూడెంఅర్బన్: డ్రంకెన్ డ్రైవ్ చేసిన 32 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బుధవారం తీర్పు చెప్పారు. వన్‌టౌన్ పరిధి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వాహనాల తనిఖీల్లో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేయగా 32 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వారందరినీ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి జరిమానా విధించారు.

10న ఇనుప తుక్కు వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చుంచుపల్లి మండలం ప్రశాంత్‌నగర్ పంచాయతీ గరిమెళ్ల హెచ్ఎన్‌టీసీ నర్సరీలోని ఇనుప తుక్కుతో పాటు వెదురు బొంగుల వేలం నిర్వహించనున్నట్లు పీఓ బి.రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలోని సుమారు 98 వెదురు బొంగుల పొదలు, సుమారు ఐదు వందల కిలోల పాత ఇనుము తుక్కును వేలం వేయడానికి నిర్ణయించామని, ఆసక్తి గల వారు ధరావతు సొమ్ము రూ.3 వేలు చెల్లించి ఈనెల 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు హెచ్ఎన్‌టీసీ నర్సరీ గరిమెళ్లపాడులో జరిగే వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

చేపల కోసం చెరువు నీళ్లు వదిలారు...



నల్ల చెరువు నుంచి బయటకు వెళ్తున్న నీరు

వైరా: అన్నదాతలకు ఆదెరువుగా, మత్స్యకారులకు అండగా నిలుస్తున్న నిండా నీరు ఉండగా.. చేపలు పట్టడం సాధ్యం కావడం లేదని కాంట్రాక్టర్ నీరు విడుదల చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలోని నల్ల చెరువు నీటిని అనుమతి కాంట్రాక్టర్ చేపల వేట కోసం వదిలినట్లు సమాచారం. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులో 3.5 అడుగుల మేర నీరు ఉంది. అయితే, నీరు విడుదల చేయడానికి నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి అవసరం కాగా, అదేమీ లేకుండా మూడు రోజులుగా నీటిని వృథాగా విడుదల చేయడంతో చెరువు ఖాళీ అయ్యే స్థితికి చేరింది. మత్స్య సొసైటీ అధ్యక్షుడు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఈ ఘటనకు పాల్పడినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అలాగే, సుమారు 250 ఎకరాల మేర వరి నాట్లకు ఇబ్బంది ఏర్పడనుందని రైతులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖ, మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఐబీ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెరువులో చేపల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు నీరు వదిలినట్లు ఆలస్యంగా తెలిసిందని, బాధ్యులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం చెరువు వద్ద లష్కర్లతో పహారా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

యువకుడు అదృశ్యం

పాల్వంచరూరల్: తొమ్మిది రోజుల కిందట సుతారి పనికోసం వెళ్లిన యువకుడు కనిపించకుండాపోయిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన, సూతారి మేస్త్రీగా పనిచేస్తున్న ధర్మసోత్ సంతోష్ గత నెల 27వ తేదీన పనిఉందని ఇంట్లో తల్లికి చెప్పివెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తల్లి హచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పట్వారిగూడెంలో మహిళ..

దమ్మపేట: వివాహిత కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అన్నపురెడ్డి మండలం జానకీపురం గ్రామానికి చెందిన వేముల వరలక్ష్మి తన కుమారుడితో కలిసి వేసవి సెలవులకు మండలంలోని పట్వారిగూడెంలోని పుట్టింటికి 20 రోజుల కిందట వచ్చింది. మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రలో ఉండగా, ఆమె బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వరలక్ష్మి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మొదలుకు నిప్పు.. వాహనంపై పడిన చెట్టు

ముగ్గురికి తీవ్రగాయాలు



రహదారిపై పడిన చెట్టు

తిరుమలాయపాలెం: రోడ్డుపై వెళ్తున్న వాహనంపై భారీ వృక్షం పడడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తిరుమలాయపాలెం కొక్కిరేణి స్టేజీ సమీపాన బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలు... పంటలపై నీడ పడుతోందని కొందరు రైతులు రహదారి పక్కన చెట్ల మొదళ్లకు నిప్పు పెడుతున్నారు. ఇలాగే చేయడంతో చెట్టు ఒక్కసారిగా కూలగా అదే రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో వాహనంపై వెళ్తున్న బీసురాజుపల్లితండాకు చెందిన బోడ సేవ్యా, పద్మ, సుధాకర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు చేరకుని జేసీబీతో చెట్టును తొలగించారు.

విధులకు ఆటంకపర్చిన ఇద్దరిపై కేసు

కారేపల్లి: అటవీ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కారేపల్లి అటవీ రేంజ్ పరిధి గేటు రేలకాయలపల్లిలో ధర్మసోత్ సూర్యం, ఆయన కుమారుడు జేసీబీతో అటవీ భూమిలో దున్నుతున్నారు. ఈ సమాచారం అందుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఇమ్మడి వీరభద్రం, బీట్ ఆఫీసర్ రమాదేవి వెళ్లి అనుమతి పత్రాలు అడగగా సూర్యం, ఆయన కుమారుడు అసభ్య పదజాలంతో దూషిస్తూ ఉద్యోగులను గెంటేశారు. దీంతో ఉద్యోగుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గోపి తెలిపారు.

తిరంగా ర్యాలీ

మధిర: ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై త్రివిధ దళాలకు వందనం చెబుతూ మధిరలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులను మట్టుబెట్టడమే కాక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా దేశ సైనికుల సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.కొండల్‌రావు, గల్లా సత్యనారాయణ, నెల్లూరు కోటేశ్వరరావు, ఎస్.కే.మహమ్మద్ ముజాయిదీన్ మాట్లాడగా ఏలూరి నాగేశ్వరావు, చావా వేణు, చేకూరి కృష్ణారావు, రషీద్, గాలిమ్, కురువెళ్ల కృష్ణ, చెరుగుడ్ల నర్సింమారావు పాల్గొన్నారు.

ఉద్యోగాల గని.. సింగరేణి..



కార్మికుల పిల్లలకు నియామకపత్రాలు అందజేస్తున్న ఏరియా జీఎం శాలేంరాజు (ఫైల్)

- డిపెండెంట్ల ద్వారా 18 వేలు
- ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 6 వేల ఉద్యోగాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 1998లో నిలిచిపోయిన వారసత్వ ఉద్యోగాలను.. టీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పునరుద్ధరించింది. ఏడేళ్లలో 18 వేల మంది వారసులకు ఉద్యోగాలు కల్పించింది. సుమారు 6 వేల మందికి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ఉపాధి కల్పించింది. రోస్టర్ విధానం అములులో భాగంగా 665 ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసింది. ప్రస్తుతం సింగరేణివ్యాప్తంగా 19 ఓపెన్‌కాస్ట్ గనులు, 23 భూగర్భ గనుల్లో 40 వేల మంది పర్మనెంట్ కార్మికులు, 2,400 మంది అధికారులు, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గు ద్వారా తెలంగాణతోపాటు మరో 7 రాష్ట్రాల్లో సుమారు 2 వేల పరిశ్రమల్లో సుమారు లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని అధికారులు చెబుతున్నారు.

అంకితభావంతో పనిచేయాలి..



కొత్తగూడెం ఏరియాలో ఇప్పటి వరకు 669 మందికి డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాం. అంకితభావంతో విధులు నిర్వర్తించాలి. సంస్థ అభివృద్ధికి కృషిచేయాలి. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారిలో సగం మంది విధులకుగైర్హాజరవుతున్నారు. వీరు పద్ధతి మార్చుకోవాలి.

–శాలేంరాజు, ఏరియా జీఎం

సింగరేణిలో సౌకర్యాలు ఎక్కువ..



దేశంలో ఏ ఇతర బొగ్గు పరిశ్రమల్లో లేని సౌకర్యాలు సింగరేణిలోనే ఉన్నాయి. ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ 13 రకాల సదుపాయాలతోపాటు అనుకోని పరిస్థితుల్లో కార్మికుడు మృతి చెందితే రూ.కోటి ప్రమాద బీమాతోపాటు మ్యాచింగ్ గ్రాంట్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నాం.

–జీవీ కిరణ్‌కుమార్, జీఎం (కార్పొరేట్ వెల్ఫేర్)

మాది మూడోతరం



సింగరేణిలో మా తాత, ఆ తరువాత మా తండ్రి, ప్రస్తుతం నేను పనిచేస్తున్నాను. మా తాత, తండ్రి ఏమి చదువుకోకున్నా కంపెనీ ఉపాధి కల్పించింది. నేను బీటెక్ చదివి కంపెనీపై మమకారంతో సింగరేణి ఒడిలో సేవలందించాలని భావించాను. సంస్థ ఎంపిక చేసి నియామకపత్రాలు ఇవ్వటం హర్షణీయం.

– గద్దం దినేశ్, డిపెండెంట్ ఉద్యోగి

జాప్యాన్ని నివారించాలి



మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుడి పేరు తీసేసిన తర్వాత రెండు నెలల్లో డిపెండెంట్‌కు ఉద్యోగం వచ్చే విధంగా అధికారులు పనులు వేగవంతం చేయాలి. కానీ, రెండేళ్లు గడుస్తున్నా ఏరియాలోని గనులు, జీఎం కార్యాలయ పర్సనల్ విభాగం అధికారులు ప్రతీ చిన్న విషయంలో కొర్రీ పెడుతున్నారు. ఇది సరైంది కాదు.

–మొగిలిపాక రవి, ఏరియా ఉపాధ్యక్షుడు, టీబీజీకేఎస్

పారదర్శకంగా రోస్టర్ విధానం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అమ లు కాని రోస్టర్ విధానం కేవలం సింగరేణిలో ఎంతో పారదర్శకంగా అమలవుతోంది. రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తున్నారు. స్థానికులకు 80 శాతం, స్థానికేతరులకు 20 శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. పరీక్ష జరి గిన రోజే ఫలితాలు ప్రకటించడం గొప్ప విషయం.

–అంతోటి నాగేశ్వరరావు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ